# ఆఖరు కోరిక

శ్రీ పన్యాల వేంకటరంగనాథరావు

## ౧

"బావా!

ఈ మారుకూడా నా వుత్తరానికి నీవు జవాబివ్వకపోవడంబట్టి చూస్తే ఏదో ఇందుకు ప్రబలమైన కారణం ఉండిఉండాలని నేను తలుస్తున్నాను. అక్కడి విషయాలు బొత్తిగా నాకు తెలియకుండా ఉండటం మూలాన కొంత ఆందోళనగా నా కున్నప్పటికీ, విశేషించి నాకు తెలియని ఆందోళనకూడా ఏదో ఈమూణ్ణాళ్లూ నన్ను వేధిస్తూవుంది. ఇప్పుడు మళ్లా ఈవుత్తరం వ్రాయడానిక్కూడా ఈ తెలియని ఆందోళనే కారణమై ఉంటుందని అనుకొంటాను.

ఈ నావుత్తరంలో పూర్వపుధోరణి పూర్తిగా మారిపోవటం మూలాన నీకు చాలా ఆశ్చర్యంగాగూడా వుంటుందని నా నమ్మకం. ఇలాంటి ధోరణిలో ఇప్పుడు నే నెందుకు రాస్తున్నానోకూడా నాకు పూర్తిగా తెలియక పోవడంచేత, నువ్వు, నావల్ల ఏదో పెద్ద అపరాధం ఉందని అనుకోవద్దంటూ బ్రతిమాలుకొంటున్నాను బావా!

అక్కయ్య కిప్పుడు మూడో నెలని రెండు నెలల క్రితం నువ్వు వ్రాసిన ఉత్తరాన్నిబట్టి ఇప్పుడు అక్కయ్యకు అయిదో నెలని నిర్ధారణచేసుకోగలుగుతున్నాను. ఆ వుత్తరంలోనే అక్కయ్యకు అప్పుడప్పుడు జ్వరం వస్తూం దనికూడా వ్రాశావు జ్ఞాపక ముందా? ఇప్పుడక్కయ్య నిమ్మళంగా ఉందని తలుస్తున్నాను. నీకు కొడుకుపుడితే తనివితీరా ముద్దుపెట్టుకుని నాలోవున్న మాతృత్వాన్ని ప్రతిఫలింప జేసుకోవడం ఎప్పుడోకదా అని నిరీక్షిస్తున్నాను బావా!

ఇదిగో వస్తున్నాను. వచ్చేస్తున్నాను వారం రోజుల్లో. రేపటినుంచీ మాపరీక్షలు మొదలుపెడతారు. నేనీ వుత్తరంవ్రాస్తూ చదువు ఎగవేశానని అనుకొంటున్నావుకదూ? అంతా పూర్తి చేసుకొనే వ్రాస్తున్నాను కాస్త మనస్సుకు రిలీఫ్ కలగడానికి.

నువ్వా తర్వాత ఏమనుకొన్నా సరే, నీతో ఏదో చెప్పుకోవాలని నాహృదయం ఆరాటం పడుతోంది మఃహోః. నిజం. దాన్నినే నణచలేకుండా వుండటానికి కారణం నేనే గుర్తించుకోలేకుండా వున్నాను. ఒకప్పుడనుకొంటూ వుంటాను — అక్కయ్య కేమన్నా ద్రోహం చేస్తున్నానేమో!, అన్యాయంగాని చేస్తున్నానేమో అని. అక్కయ్యను తలచుకొంటూన్నప్పుడల్లా నీమీద నాకు పట్టరాని కోపం అమాంతంగా వచ్చేస్తూ వుంటుంది. అదెందుకో తెలుసునా? నాయీ కలవరానికంతటికీ కారణం— నువ్వానాడు — జ్ఞాపకంవుందా— డాబాపైన... సంజెచీకట్లో...నన్ను దగ్గరగా...వొద్దు వొద్దంటూంటే ...లాక్కొని...తనివితీరా...ముద్దులాడావు...అబ్బ...తలచుకొంటే...నాదేహం గగుర్పొడుస్తూంది...అదే కా ర ణ ం ... నేనెంతో నిన్ను బ్రతిమాలుకొన్నాను కూడా...అలా చెయ్యవద్దని...కాని నువ్వు వొట్టి మొండివాడివైపోయి అప్పుడు నామాటే విన్నావుకావు. నన్ను దగ్గరగా లాక్కున్నావు...మరి నే నేమయ్యానో నాకే తెలియనిచ్చావు కావు...ఏం చెయ్యను?—నీమొండి హస్తాల్లో ఇమిడిపోక తప్పిందికాదు. అప్పటినుండీ నాహృదయాన్ని నువ్వే వశంచేసేసుకొన్నావు. చెప్పు. ఇది నీ తప్పా నాతప్పా? మధ్యను నాచేత అక్కయ్యకు ఎక్కువగా అన్యాయం చేయిస్తున్నది నువ్వు కావూ?

బావా! నిజంగా నేను ద్రోహమే చేస్తున్నాననుకొంటాను. కాని బాగా ఆలోచించిన కొద్దీ మనసు అన్యథా మళ్లించుకో లేకుండా ఉన్నాను. ఇవాళ ప్రొద్దుటే ఒక తీర్మానానికి వచ్చి మరి నీకీ వుత్తరం వ్రాయలేకుండా వుండలేకపోయాను.

నాలో నీకేమన్నా సహింపరాని దోషాలు కనిపిస్తున్నాయా? అలా అయితే ఈ నారెండు చేతులూ

జోడించి నీపాదాలమీద పడి వేడుకోడానికే వచ్చేస్తున్నా ననుకో–నన్ను మన్నించమని.

—అనూరాధ”

ఈ విలక్షణధోరణి విశ్వాన్ని కొంతమట్టుకు ఆకర్షించినమాట వాస్తవమేకాని, ఎప్పుడూ లేనిది ఇప్పుడీవిధంగా అనూరాధ ఉత్తరం వ్రాయడానికి గల కారణం ఏమిటో అతని కూహాతీత మయిపోయింది. ఇదివరకు అనూరాధ వ్రాస్తూన్న ఉత్తరాలను అరుంధతికి చూపుతూ ఆమెనే చదువుకొంటూ ఉండమనే వాడు కాని, ఇప్పుడుకూడా అలాగే చేస్తే, ఎటొచ్చి ఏం ముంచుకొస్తుందో! ధోరణి అలావుంది మరి!...

ఉత్తరం చదువుకొంటూన్నంతసేపూ అనూరాధ తన కళ్లకక్కడుతూనే వుంది. చివర కత డెలాంటి నిర్ధారణకు వచ్చాడంటే, అనూరాధ తనను విడిచి వుండలేదేమో అని. అనూరాధకూ విశ్వానికీ మధ్య వున్న ఈ సంబంధం గురించిగాని, వాళ్లలో వాళ్లకు ఇతఃపూర్వం జరిగిన గ్రంథాలు గురించి గాని అరుంధతికి ఈషణ్మాత్రమైనా తెలియకపోవడం, ఇదివర కల్లా చాలా మంచిదే అంటూ అభిప్రాయపడుతూవుండిన విశ్వం, ఇప్పుడదంతా అరుంధతికి తెలియకుండా ఉండక పోవడమే ప్రమాదిస్తుం దేమో మున్ముందు అని అనుకొంటున్నాడు. ఉత్తరాన్ని మరొక్కసారి చదివి, సిగరెట్టుపొగ ఉంగరా లుంగరాలుగా వదలుతూ డాబాపైన ఈజీఛెయిరులో ఆకాశంవేపు చూస్తూ కూర్చుని వున్నాడు,

ఈవుత్తరం అరుంధతికి చూపిస్తే అందులో ఉన్న తప్పేమి టంత? తప్పన్న దెంత వెదికినా తన కెక్కడా దొరకడం లేదుగాని, ఇలాంటివిషయాల్లో అరుంధతి హృదయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో అతనికి తట్టటం లేదు. పైగా తనను అరుంధతి అప్పుడప్పుడు ఏదో రహస్యంగా అనుమానంగా చూస్తూ వుండటం, ఆమె చూపులద్వారా, మాటలధోరణి వల్లా ఇంతకు పూర్వం అనేకసార్లు కనిపెడుతూనేవచ్చాడు. అలాంటి అనుకోని సన్నివేశం వచ్చినప్పుడల్లా తను కూడా చింతిస్తూవుండడం కద్దు. ఈ చింతించడానికి కారణం తన్నధికంగా ప్రేమిస్తూన్న అరుంధతికి తనేదో అన్యాయం చేస్తున్నానేమో అని అనుకోవడమే.

వెనకపాటునే వచ్చి అరుంధతి భర్తను పావుగంటై కనిపెడుతూనే వుంది. విశ్వం తదేకధ్యానంలో వుండడం ఆమె కేమీ ఇష్టంగా లేకపోయినప్పటికీ ఆ ధ్యానంలో నుండి విశ్వాన్ని కలతమాత్రం పెట్టడానికి ఆమెకు మనస్కరించడం లేదు. అయితే ఎప్పటికైనా కుర్చీలో నుండి కదలి తన్ను చూస్తాడేమో అని అలాగే నిలుచుందిగాని దేహంభారంవల్లనే మోకాళ్లు కొద్దిగా పీకడం మొదలుపెట్టినవి. మరి ఉండలేక పోయింది అరుంధతి.

మెల్లగా కుర్చీ వెనకాల చేతులువేసి ముందుకు కొద్దిగా వంగుతూ, “ఏమి టీవాళ అంతదీక్షతో ఆలోచిస్తున్నారు” అన్నది.

సరీగ్గా ఇలాంటప్పుడే క్రిందగడియారం ఆరు గంటలు కొట్టడం వినపడింది డాబాపైకి.

ఈ గంటల శబ్దానికీ, అరుంధతి పలకరించడానికీ కొంత కంగారుపడ్డాడు విశ్వం.

“ఆఁ ... ఏమీ లేదు ... అరూ ... నువ్వింకా రాలేదేమా అనే ఆలోచిస్తున్నాను.” మడచిన ఉత్తరాన్ని జేబులో పెట్టుకొంటూ అన్నాడు.

“లేదు. ఏదో మరో విషయమై తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు మీ ముఖమే చెబుతోంది” అన్నది అరుంధతి ఎప్పట్లాగే చిరునవ్వుతో.

చేతిరుమాలు తీసిముఖ మంతా ఓమారు తుడుచుకొని,

“ఇప్పుడేమని చెపుతోంది నాముఖం” అని అరుంధతికళ్లల్లోకి చూచాడు విశ్వం.

“అలా తుడిచేసుకోవడంవల్ల మీముఖం ఏమీ చెప్పటంలేదుగాని, ఇప్పుడు మీకళ్లు చెపుతున్నాయి ఇంకా మీ ఆలోచనంతటికీ ఏదో పెద్దకారణం వుందని.”

అరుంధతి ఇలా అంటూ ముందుకు వచ్చి కుర్చీ కాలుమీద తనకాలు చుట్టి, కుర్చీచేతిమీద కూర్చున్నది

మహానేర్పుతో విశ్వానికెదురుగా. ఈమాటలతో మొదటే కొంత బెదరుచూపులతో వున్న విశ్వంకళ్లు గజిబిజిలాడటం మొదలుపెట్టినవి.

అరుంధతితో మాట్లాడటం కష్టం అని ఇదివరకే నిర్ధారణ చేసుకొన్న విశ్వం మరి నోరు కదల్ప లేకపోయాడు. అలా ఆమెను చూస్తూ చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ కూర్చున్నాడు.

ప్రపంచంలో వున్న ప్రేమ అనే దాన్నంతటినీ వడకట్టేసుకొని విశ్వంలో ప్రతిఫలింప జేసుకొన్నది అరుంధతి. అతనిఫాలంమీద పిల్లవాయువుల వీవనల చేత అల్లల్లాడుతూ వున్న వుంగరాలముంగుర్లను తన సున్నితాలైన వ్రేళ్లతో సవరిస్తూ అతని బుగ్గలను మెత్తగా తడిమింది. ఆస్పర్శలో ఎదో చెప్పలేని స్వర్గసౌఖ్యాని కతీతమైపోయిన ఆనందా న్ననుభవిస్తూ క్షణం కళ్లుమూసుకొన్నాడు విశ్వం. ఆకనుమూతలో కనిపిస్తోంది అరుంధతి. ఆపైన అనూరాధ. ఆమెకూ ఈమెకూ అరుంధతీ అనూరాధ లనేపేర్ల తేడాలుతప్ప విశ్వానికి మరోతేడా వెదకినా కనపడటంలేదు. కళ్లు తెరచాడు.

తన అరుంధతి చిరునవ్వుతో — ఆవిమల వదనాన్ని క్షణంచూచి ఆమెలోవున్న ఆ దివ్యదేవత్వానికి ముగ్ధుడైపోయి, ఆమెసిగలో వున్న తెలిమల్లెపూలగుబాళింపుల నాఘ్రాణిస్తూ తన్మయుడైపోయాడు విశ్వం.

"ఏదీ...కళ్లు తెరవండి ..." లేనగవులోనుండి వెలువడ్డ ఈ తీయనైన పలుకులను విని ఆమెవ్రేళ్లను తనబుగ్గల కానించుకొంటూ కళ్లు విప్పి చూచాడు విశ్వం.

"మీ ఆనందంలో నాకు వంతు లేదుగాబోలు"

అతను చిరునవ్వు నవ్వాడు.

"అనూదగ్గర్నుంచి వుత్తరం వచ్చింది"

"ఆఁ...అనూవద్దనుంచా ? నాతో చెప్పారు కాలేం-" కొద్దిగా ఆతురత కనబరిచింది అరుంధతి.

"ఇప్పుడు చెప్పుతున్నాగా..."

"నాకు చూపించారేకారు"

"ఇప్పుడే వచ్చింది."

"ఎదీ?"

అతని హృదయం కొట్టుకొన్నది. ఆ వుత్తరం ఇచ్చేయడమే అరుంధతికి? ఇవ్వకుండా వుంటేనే ఏవిధానైనా మంచిదేమో!

"నీకా వుత్తరాన్ని చూపినా ఒకటే-చూపకపోయినా ఒకటే..."

"ఏం...?"

"ఆంగ్లవిద్యను సార్థకం చేసింది మీ చెల్లి" బొంకడాని కారంభించాడు,ఎలాగో వోలాగు తప్పించుకోవాలనే వుద్దేశ్యంతో.

"ఇంగ్లీషులో వ్రాసిందా ఏమిటి?"

"అవును. మరో వారంరోజుల్లో వస్తుందట"

అరుంధతికి విశ్వంపైన అనుమానం అప్పుడప్పుడు కలుగుతూన్నా నమ్మకంమాత్రం వుండడంచేత ఇప్పుడు కూడా పూర్తిగా నమ్మింది.

"అయితే దాని పరీక్షు లయిపోతున్నా యన్న మాట." అన్నది ఏదో ఆలోచిస్తూ అరుంధతి.

హమ్మఁ-బ్రతికి బయటపడ్డాంరా భగవంతుడా- అనుకొని కొంత తెప్పరిల్లుకొన్నాడు విశ్వం.

"ఆహాఁ – పరీక్షలూ అయిపోయాయి - చదువూ పూర్తి అయింది" అన్నాడు మెల్లగా.

"నాకు సాయంగాకూడా వుంటుంది" అన్నది అరుంధతి ముఖాన్ని క్రిందకు దించుకొని.

ఇప్పుడు విశ్వం లేచి సరీగ్గా కూర్చున్నాడు.

"అవునుగాని-అరూ-నువ్వేచాకిరీ చేస్తానంటావుగాని-వంటమనిషిని పెడతానంటే ఎందు కిష్టంలేదు? నువ్విలాంటిసమయంలో ఎక్కువగా కష్టపడవచ్చా?" అన్నాడు ఆమెముంగుర్లు సవరిస్తూ.

"పోనిస్తురూ-అదోఖర్చుగాని-ఏమిటంత పెద్ద చాకిరీ? వోర్చివంటేనా ? ఇంతకూ మీకూనాకేగా గుప్పెడుబియ్యం-అనూ వస్తే మరి అదే సాయంచేస్తూ వుంటుంది. మరి బాధే వుండదు."

అరుంధతి తనచేతులతోనే వంటవండి విశ్వానికి పెట్టాలిగాని వంటమనిషెవరు మధ్య? అందుచేతనే అరుంధతి కిష్టంలేదుగాని డబ్బుదగ్గర గట్టితనం అని మాత్రం కాదు.

అప్పటితో ఆవిషయం అలా పూర్తి అయింది.

౨

"అనూ రేపుసాయంత్రమేకదండీ వస్తుంది?" విశ్వానికి మజ్జిగపోస్తూ అన్నది అరుంధతి.

ఏదో ఆలోచిస్తూన్నట్టు ముఖాన్నిపైకెత్తి—

"ఆఁ...ఆఁ...రేపేవస్తుం దన్నట్టు... ఎంతచక్కా జ్ఞాపకంచేశావు. నేను మరచేపోయాను...పనితొందర్లలో..."

నిజానికి నిమిషాలు లెక్కపెడుతూన్నా అరుంధతిదగ్గరమాత్రం ఆ దుర్బలత్వం కనబరచకుండా ఉండలేకపోయాడు.

"పాపం మరచిపోరా?" అని ఎగతాళి చేసింది అరుంధతి చిరునవ్వు నవ్వుతూ.

"నిజంగానే అరూ...రేపు నేను స్టేషనుకూడా వెళ్లాలి."

విశ్వం భోజనంచేసి పనిమీద పైకి వెళ్లిపోయిన తర్వాత తలుపుచేర వేసి వచ్చి,తనపనులుకూడానిర్వర్తించేసుకొని తీరుబడిగా మంచంమీదవ్రాలింది అరుంధతి. పడుకున్నదేగాని, ఆమె మనసంతా ఇప్పుడు అనూరాధమీదకు పోయింది. అరుంధతికీ, అనూరాధకూ చిన్నతనాల్లోనే వివాహాలైపోయినాయిగాని, అనూరాధకు మాత్రం విధి ఎదురు తిరిగింది. ఆమెభర్త, వివాహమైన మరుసటి సంవత్సరమే కలరా వచ్చి హటాత్తుగా పోయాడు. అప్పటికి అనూరాధకు ఎనిమిదే ఏళ్లు. అరుంధతికి పదే యేళ్లు. ఇటీవల, అయిదేళ్లక్రితం తల్లితండ్రు లిద్దరూకూడా అకస్మాత్తుగా, పుట్టినవాళ్లిద్దరే ఇద్దరాడపిల్లలైనా వాళ్లకు వెనక ఏమీకూడా అభిమానపురస్సరంగానైనా మిగల్చకుండా పోవడంచేత, అప్పటికి ఆరునెలలక్రితమే అరుంధతి పెద్దదైవుండడచేంతా విశ్వం వెంటనే కార్యంచేసుకొని, అనూరాధనుకూడా తనతోనే తీసుకొని వచ్చేశాడు. అరుంధతీ అనూరాధలకు తల్లివంక మిగిలినదల్లా వాళ్ల అమ్మమ్మమాత్రమే. మొదట, లోకం ఏమన్నా అన్యథాభావించవచ్చునని అనూరాధను వాళ్లఅమ్మమ్మవద్దనే వుంచేద్దామనుకొన్నాడు, గాని-అరుంధతిపోరువల్ల అలా సంభవించింది కాదు.

అరుంధతికి అనూరాధంటే తీరని ప్రేమ. ఆమెనూ చూచి, ఆమె భావిజీవితాన్నిగూర్చి ఆలోచించుకొంటూండేటప్పుడు అరుంధతి అప్రయత్నంగా కళ్లవెంట నీళ్లు కార్చుకొనేది. ఇప్పుడూ-ఈక్షణంలో కూడా అలానే అయింది.

అనూరాధను విద్యావతిగా చేయడానికూడా అరుంధతే కారణం. అనూరాధ అధమం స్కూలు ఫైనలైనా ప్యాసవుతే చాలనుకొని ఆమెను పట్నం పంపి చదివిస్తోంది. ఇప్పుడు అనూరాధ స్కూలు ఫైనలు పరీక్ష లిస్తూంది.

అనూరాధను ఒక యింటిదాన్నిగా చేసే బాధ్యతంతా పూర్తిగా తనమీదనే వుందనే అభిప్రాయంతో రాత్రీపగలూ ఒకటే ఆలోచిస్తోంది అరుంధతి. ఈ ఆలోచనకు కారణం ఏమిటని అప్పుడప్పుడు విశ్వం అడుగుతూవస్తే.

"ఏంలేదు-మన అనూగురించే..." అంటూండేది.

"ఓస్. ఇంతేనా?... ఇప్పుడేం వచ్చింది తొందర? ఆమె చదువు కాస్తా పూర్తి కానీ" అంటూండేవాడు విశ్వం.

నిజానికి అనూరాధను ఎవ్వరి కిచ్చికూడా వివాహంచేయడాని కిష్టం లేదు విశ్వానికి. అనూరాధకూడా తన సొత్తే అని తన దృఢాభిప్రాయంతో కాలం వెళ్లబుచ్చుతున్నాడు. అయితే యీసంబంధం అరుంధతిగ్గానీ తెలుస్తే అప్పటి పరిస్థితు లెట్లా వుంటాయో ముందుగా ఊహించుకోడాని కతని కతీతంగా కనబడసాగింది. శుభప్రదమైతే మరేం ఫరవాలేదు గాని...అట్నుంచి ఎదురు తిరిగితే ఆపైని తను చేసేదేమిటి?

ఈ విషయాలేవీకూడా అరుంధతికి తెలియవు. అనూరాధను మంచివాడికిచ్చి పెళ్లి చేయాలని వుంది. అయితే ఇందుకు తగినంత ధైర్యం ఆ స్త్రీ హృదయంలో లేదు. అలాగని తన చెల్లెలిని తన యింట్లో ఏవిధంగా వుంచుతుందీ? ఉంచుకొంటుంది? లోకానికేమని చెపుతుందీ?

ఒకసారి కాదు, అనేకసార్లు భర్త ఎదట తన చెల్లెలిని గురించి చెప్పింది. తన చెల్లెలికి తామే వివాహం చేయాలని కూడా అన్నది. అందుకు అలాగే అనీ, ఇప్పుడేం తొందరనీ, ఎగవేస్తూ వుండేవాడు. అయితే ఆమె విధవకదా, ఇప్పుడు అందరికీ ఎదురుతిరిగి ఎలా రెండో పెళ్లి చేస్తాం అనే వుద్దేశ్యం ఆ యిరువురిలోకూడా కలగలేదు. ఇందుకు ముఖ్యమైన కారణం, ఇద్దరూ రెండువిధాలుగా అనూరాధను ప్రేమిస్తూ వుండటమే అయివుండవచ్చు ననుకొంటాను. ఆమెకింకా వివాహమే కాలేదని సైతము ఇద్దరూ ఓసారి కూడబలుక్కున్నారుకూడాను.

ఇంక అనూరాధ ఏంచేసిందంటే, తాను చదువులో పడినప్పుడే ప్రయత్నపూర్వకంగా తనకు వివాహమైన విషయం మరచిపోయింది. అందుకు ప్రబలమైన కారణాలు కల్పించినవారు విశ్వం అరుంధతిన్నీ.

అంతకుముందు తనకు వివాహమైపోయినట్టూ, భర్త ఏదో అయిపోయినట్టూ లీలగా భావించుకొనేది అనూరాధ. కాని తను బావగారియింట్లో కాలుపెట్టినన్నాటినుంచీ ఆవిషయం పూర్తిగా మరచిపోయి, చదువులో మునిగిపోయి, మరి తలచుకోవడమే మానివేసింది.

మంచంమీద ఇలా వెనకాముందూ పడుతూ అనూరాధనుగురించే ఆలోచిస్తూ చటాలున ఏదో స్ఫురణకు రాగా లేచి విశ్వం టేబిలువద్దకు పోయి డ్రాయరు తీసి ఏదో వెదకడం ఆరంభించింది. నాలుగైదు కాగితాలు తిరగవేయగా తొలినాడు అనూరాధ విశ్వానికి రాసినవుత్తరం కనబడ్డది. రచన తెలుగులోనేవుంది! అయితే భర్త ఎందుకలా చెప్పాడు — ఇంగ్లీషులో వ్రాసిందని? గబగబా మొదటినుండి చివరివరకూ ఓమారు చదివేసింది.

ఏ అక్షరాలు బోధపడ్డాయో ఏవి బోధపడలేదో గాని, కొంత ఆందోళన కలిగి మళ్లీ చదివింది. ఈ మారైనా వుత్తరం పూర్తిగా అర్థంకాలేదు. అయితే అర్థమైనదల్లా ఏమిటంటే, అనూరాధను తన భర్త ఏకాంతంగా ఎప్పుడో ఒకమాటు ముద్దుపెట్టుకొన్నాడని మాత్రమే...ఇదొక్కటి చాలు ననుకొంటాను... ఆమె భర్తమీదా చెల్లెలిమీదా అభిప్రాయాలను మార్చుకోడానికి. ముచ్చెమటలు పోయగా మళ్లీ వుత్తరాన్ని యథాస్థానంలో పెట్టి మంచంమీద పడుకోని ఆలోచించటం ఆరంభించింది!

అరుంధతి ముఖంలో ఏదో చెప్పరానిభావం ఆ సమయంలో గోచరిస్తూవుంది. అది ఆమె కర్థం కాకుండా ఉంది. ఇప్పుడు-ఈసమయంలో తన ప్రియమైన చెల్లెలిని ఏవిధంగా సమర్థించుకోవడం?

నిజంగా అరుంధతికి విశ్వం అంటే అమితమైన ప్రేమ. విశ్వం పూర్తిగా తనసొత్తు. భర్త మరొకరి వశం కావడం ఆమెహృదయం భరించలేదు. అలాంటిది ఇప్పుడు తానెవర్ని ఎక్కువగా ప్రేమిస్తున్నదో అలాంటి తనచెల్లెలికే తనభర్త వశమైపోయినట్టు వుత్తరంమూలాన అర్థమవుతూన్నప్పుడు, ఇంక తన చెల్లెలిని ఏవిధంగా అర్థంచేసుకోవాలో ఆమెకు తెలియకుండావుంది.

అసలు భర్తమీద తన కంతగా ప్రేమ కుదరటానికి కారణమేమిటంటే. ఆమెకు ఇతఃపూర్వం ఊహాతీతాలైపోయిన మధురమైన అనుభవాలు ఆమెకు తనభర్త ఇవ్వటమే. అటువంటి ఆనందం ఆమెకు ఆదినుండీ ఆమెభర్త ఇస్తున్నాడు మరి! ఇలా ఏస్త్రీకి అయినా సరే నిజమైన భర్తవల్ల ఆనందమనేదే కలుగుతూవుంటే వాళ్లు ఆభర్తలను విడిచీపెట్టరూ, ద్వేషించనూ ద్వేషించరు. పైగా వాళ్ల సుఖాలకూ తమసుఖాలకూ ఎక్కువగా అవకాశాలను కల్పించుకొంటూ వుంటారుకూడా. అది స్త్రీహృదయం. అలాంటి స్త్రీలు భర్తలు మరొకరి వశమైపోతున్నారంటే సహించలేరేమో కూడా అని అనుకొంటాను.

నిజంగా అరుంధతికికూడా అంతే జరిగిందిప్పుడు. అయితే ఈ కారణంచేత అనూరాధ మీద, లేనిఈర్ష్య

నంతా తెచ్చి పెట్టుకొంటుందా ? అది తనకు సాధ్యమైన పనేనా ? అది అసందర్భంగా ఉండకుండా ఉంటుందా ? కాని ఇందులో పూర్తిగా స్వార్థం వుందన్నమాట ఆమె ఆసమయంలో గుర్తించుకో లేకపోయింది.

అయితే స్వార్థాన్ని అటువంటి సమయాల్లో గుర్తించుకో లేకపోవడం కూడా ఆమెలోపం కాదనుకుంటాను. అది స్వార్థం అని గుర్తించుకోనేందుకు మొదట హృదయం త్యాగానికి సిద్ధపడాలి. ఏమంటే స్వార్థాన్ని విడవడానికీ త్యాగం చేయడానికీ అంత దగ్గరసంబంధం వుంది మరి !

తన సంసారం అమాంతంగా పాడుచేయడానికే తనను పూర్తిగా అన్యాయం చేయడానికే అనూరాధ విధవ అయిందేమో ! అయి తనకు దాపురించిందేమో ! అయితే, తనప్రియమైన చెల్లెలే తన భర్తతో సంబంధం కలుపుకొన్నంతమాత్రాన తన సంసారాని కేమన్నా భంగంవస్తుందా ? ఇలాంటి వూహాలీక్షణంలో అరుంధతి మనస్సులో తిరిగాయంటే అందులో ఆశ్చర్యపడవలసిన విషయం లేదనుకొంటాను.

నిజానికిలాంటివూహలతోనే తాను మధ్యాహ్నం విశ్రాంతినైనా తీసుకొనకుండా కాలం గడిపింది. భర్తవచ్చి తలుపుతట్టేసరికి, అనూరాధ తనకు శత్రువులాగే భావించుకొంటూన్న అరుంధతి త్రుళ్లిపడి లేచి, తలుపుతీసింది. విశ్వాన్నిమాత్రం - ఆప్రేమమయవిగ్రహాన్ని చూచేసరికల్లా ఎప్పటిసంగతు లప్పుడే మరచిపోయిందికూడా! చివరకు వుత్తరం విషయంలో తనతో అబద్ధం ఎందుకాడాలి అనైనా ప్రశ్న వేయలేనంత దుర్బలత్వానికి లోబడిపోయింది ఆక్షణంలో.

3

అనూరాధ వచ్చి నాలుగునెల లిట్టే గడచిపోయినా, ఈ నాలుగునెలల్లో కొంతగ్రంథం తమాషా తమాషాగా నడిచింది. ఒకరిపట్ల ఒకరి అభిప్రాయాలు కూడా అదో రకంగా మారినాయి. కాని పైకి మాత్రం ముగ్గురికిముగ్గురూ ఎప్పటిమాదిరీయే.

అనూరాధ పరీక్ష ప్యాసయినా మరి చదువు ఎక్కువ చదవడానికి మనస్కరించక ఇంట్లోనే వుండిపోయింది. అందులోనూ అక్కయ్యకు పురిటి రోజులుకూడా రావటంచేత దగ్గరెవరైనా సాయం వుండకపోతే లాభం లేదనుకొనికూడా తీర్మానించుకొంది.

అనూరాధ వచ్చిన దగ్గర్నుంచీ అరుంధతి ప్రవర్తనలో మార్పులేకపోలేదు. అలా తన ప్రవర్తన మారుతుం దని నిజానికి అరుంధతికే తెలియదు. అది తెలియకుండా అయింది. తాను చెల్లెలిమీద ఈర్ష్యపడుతున్నానేమో అని ఒక్కొక్కప్పు డనుకొంటూ, ఎప్పట్లాగే వుండా లని చాలాతీవ్రంగా ప్రయత్నించేది, కాని అనూను ఎదురుగా చూచినా, లేక అనూ. విశ్వం ఒకరితోనొకరు ఖుషీగా హాస్యాలాడుకొంటూ వున్నా ఏదో ఒక కెరటం తన హృదయంలో ఎదురుగా కొడుతూవుండేది. చాలాసార్లు తనలో తను ప్రశ్నించుకొన్నదికూడ. అనూ విశ్వంతో అంత చనువుగా వుంటేమాత్రం ఏం-అని. కాని ప్రాక్టికల్‌గా వాళ్లిద్దరూ తన ఎదురుగా కనబడేసరికల్లా ఆమె ముఖం దించుకొంటూవుండేది. ఇది విశ్వం కనిపెట్టకపోలేదు— అనూ ఈ విషయంలో శుద్ధ అజ్ఞానురాలైనా. కాని అనూరాధ తాను చదువుకొన్న తెలివినంతటినీ ఉపయోగించుకొంటూ అరుంధతికి జెదరేది.

ఒకనాడమాంతంగా తీర్మానించుకొంది విశ్వంతో మరి ఆట్టే జోస్తీగా వుండకూడ దని. అయితే అది సాధ్యపడలేదు. విశ్వమే సమయం చూచుకొని అనూవద్దకు వచ్చాడు.

"ఏం- పిలిస్తే పలకవేం ? " అన్నాడు.

" ఎందుకూ ? " బెదరుగా అన్నది అనూరాధ.

" ఎందుకూ లేదు. ప్రొద్దుట్నుండీ అంత కనబడకపోవటం ఏమని ?"

రోజు కోసారయినా అనూరాధనూ అరుంధతినీ చూడకుండా, వారితో మాట్లాడకుండా ఎలా ఉండగలడు ? ఇంట్లో వొక్కచోట అంతా వున్నప్పుడు అది మరీ అసంభవమే కదా !

అయితే, విశ్వంకూడా తరవాతను కొంత తర్జన భర్జనలు పడ్డాడు. అనూరాధమీద వ్యామోహంకొద్దీ అరుంధతిని తనేవిధంగానైనా తృణీకరిస్తున్నాడేమో అని. కాని అరుంధతి తనతో ఓమారైనా మాట్లాడక పోతే అతను సహించలేకపోవటాన్నిబట్టి, అరుంధతి తనేవిధంగా నైనా సరే అన్యాయంమాత్రం చేయడం లేదని తీర్మానించుకొన్నాడు. అయితే ఇప్పుడు కనిపిస్తున్న అపరాధ మనేదల్లా ఏమిటి? ఇంకోవ్యక్తిని ప్రేమించుతున్నాడు – అనూరాధను — తనదృష్టిలో అరుంధతీ అనూరాధలు ఒక్కలాగే కనబడుతున్నారు. అరుంధతి లేకుంటే జీవితం దుర్భరం...అనురాధ కనబడకపోతేకూడా అలాగే అనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఇరువురినీకూడా సమానంగా ప్రేమించకుండా ఉండ లేకపోయాడు విశ్వం.

"బావా" అన్నది అనూరాధ తలయెత్తి.

"ఏం–" అన్నాడు విశ్వం.

"అరూ చాలా మారిపోయింది బావా"

విశ్వం మాట్లాడలేదు.

"అరూ సుఖంకోసం నేను నీనుండి వేరుకావాలసి వస్తుంది" అన్నది తలవంచుకొని.

"ఆఁ – అదేమిటి అనూ–"అని గుబగుబలాడిపోయాడు విశ్వం.

"ఈ విషయం అరూకు తెలియదు బావా. తెలిస్తే సహించలేదని నాకు తెలుసు."

ఈ మాటలను గోడచాటునుండి వింటూన్న అరుంధతి లోలోన కుమిలిపోయింది క్షణం. అనూరాధ మీద తన కెంత ప్రేమ వుందో అంతా ఒక్కసారి పైకి పొంగి ప్రవాహమై వరదలుకొట్టినట్టు వచ్చింది. ఆ ప్రేమను ఆపుకోలేకపోయింది.

అనూరాధను తన భర్తకే యిచ్చి వివాహం ఎందుచేత చెయ్యకూడదూ? వారిద్దరి ప్రేమకూ మధ్య తను పుడకలాగు అడ్డుపడి వారి భావిజీవిత సౌఖ్యాన్ని చంపివేయడం ద్రోహంకాదూ? అయితే అందుకు స్వార్థం అనేది ఒకటి వుంది. అది త్యజిస్తేనే కాని ఇలాంటివిషయాల్లో శాంతి వుండ దనేమాట తనకు తెలియదు.

అంతటితో ఆవిషయంకూడా అలా ముగిసింది.

నెలా పదిహేనురోజులు గడచిపోయినాక అరుంధతికి నొప్పులారంభమైనాయి. ఆనొప్పులదేనొప్పులు–నాల్గురోజులదాకా పెద్దగడబిడ చేసివేసింది. ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు మంత్రసానులనూకూడా హడలుగొట్టించింది. పురుడు అతికష్టమైపోగా చివరకు బిడ్డ పుట్టేసరికి నోట మాటలేకుండా అయిపోయింది అరుంధతి. ఆసమయంలో పోనీ పట్నం తీసుకొనిపోయి హాస్పిటలులో చేర్పిద్దామన్నా వీలులేని ప్రమాదమైన స్థితి!

కుర్రవాడేమో దుండుముక్కలాగు శరీరమూ వాడూ, తెల్లగా, బొద్దుగా, మూడుమూర్తులా తల్లినే పోలివున్నాడు. బహుశా అంతపిల్లవాడు పుట్టటంచేతా, పురుడొక్క పిసరు ఆలస్యం అవటంచేతా అంత గడబిడ చేసివుంటుంది.

కుర్రాడు పుట్టి పదిహేనురోజులైనా అరుంధతికి స్వస్థత కలుగకపోవడం సరేకదా మంచంమీదినుంచి లేవనైనా లేవలేని స్థితిలో వుండిపోయింది. అక్కకు ఎన్నివిధాల సేవ చేయాలో అంతకు రెండింతలెక్కువగా, వేయిదేవుళ్లకు మొక్కుకుంటూ అష్టోపచారాలూ చేస్తూవుంది అనూరాధ. విశ్వం సరేసరి. పుట్టినవాడు బెంగతో ఏమీతోచక ఎప్పుడూ అలా అరుంధతినే కనిపెట్టుకొని కూచునేవాడు.

ఆ మంచం పట్టడం అదే రెండు మూడు నెలలైపోయింది. డాక్టరు ప్రతీరోజూ వస్తూనే వున్నాడు. చివరకు డాక్టరుకూడా అధైర్యం తోచిందని విశ్వం కనిపెట్టి హతాశుడైపోయాడు అరుంధతివిషయంలో.

"ఇంక–మరి నేను–బ్రతకను–"

ఈ మాటలు అరుంధతినోటివెంట వెలువడగానే అనూరాధా విశ్వం ఒక్కమారు త్రుళ్లిపడ్డారు.

"అలాంటి మాట లనకూడ దక్కా - ఇటు... చూడు..."అంటూ కళ్లల్లో నీళ్లు నింపుకొన్నది అనూరాధ.

విస్తుపోయి అలాగు కొయ్యగా నిలబడ్డాడు విశ్వం.

"అనూ..."

అనూరాధ దగ్గరకు వచ్చి కూర్చొన్నది.

"వీడు...నీ కొడుకు...సుమా..."

అనూరాధ నిర్ఘాంతపోయింది. అలా చూస్తూవుంది.

"ఆయన్ను...సుఖపెట్టే...బాధ్యత ... నీది"

కళ్లనీళ్లు తుడుచుకొని అరుంధతి భాలాన్ని నిమిరింది అనూరాధ. ఆస్పర్శలో ఏదో తీరని ఆనందాన్ని అనుభవించగలిగింది అరుంధతి. అప్రయత్నంగా ఆమెముఖంపైని చిన్న నవ్వు తాండవమాడింది.

"ఆయన్ను...నీ...ఆస్తి... మరేం అనుకోకు-అనూ...నేను పోతే ... ఆయన తల్లడిల్లిపోతారు... నువ్వు...ఆయన్ని...ఎలా-ఓదార్చు...కొంటావో... అనూ"

అనూరాధతలను తన తలదగ్గరగా చేర్చుకొని క్షణం కళ్లుమూసి నిట్టూర్పు విడిచింది అరుంధతి.

"నువ్వు-ఆయన్ను- వోదార్చకపోతే...నా... ఆత్మకు-శాంతి అనేది వుండదు- అనూ...ఇంద...ఈ కుర్రవాడు...జాగ్రత...నే నింక...బ్రతకను..."

చిన్నకునుకుతో కుర్చీలో కూర్చున్న విశ్వం చెవిలో ఈ మాటలు పడేసరికల్లా అతను కలవరపడిపోయి ఆగలేకపోయాడు.

"అరూ..." అంటూ వచ్చి మంచందగ్గర కూర్చొని చంటిపిల్లవాడిలాగు భోరుమని ఏడ్వసాగాడు. అనూరాధకూడా తనదుఃఖాన్ని పట్టలేకపోయింది.

"మీ రిద్దరూ..." ఇరుప్రక్కలావున్న అనూరాధా విశ్వం-చేతులను తనహృదయంపైన పెట్టుకొన్నది అరుంధతి.

"నాకు...నా ఆత్మకు...శాంతిని చేకూర్చాలి... ఇదే...నా...కోరిక..." అన్నది అరుంధతి చివరి మాటగా. అనూరాధ విశ్వంహృదయాల్లో శిలాక్షరాలుగా వుండిపోయినై. అరుంధతిహస్తం-అలాగే వుండిపోయింది చంటివాడిచుట్టూ.

కుర్రాడిని క్షణం ముద్దులాడి అరుంధతిమీద పడి భోరు మని ఏడ్చింది అనూరాధ.

విశ్వం కొయ్యబారిపోయి అలా ఉండిపోయినాడు గుక్కవిడవకుండా ఏడుస్తున్న చంటిపిల్లణ్ణి మిడుతూమిడుతూ చూస్తూ.


# కాంగ్రెసు చరిత్ర

**50 ఏండ్ల అఖిలభారత కాంగ్రెసు చరిత్రము**

**వెల రూ. 2-8-0**